పలువురు ఉపాధ్యాయులు బదిలీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు నియోజకవర్గ పరిధిలో పల్లెర్లమూడి, రమణక్కపేట, నూజివీడు బాలురోన్నత పాఠశాల, వెల్చూర్చర్ల, గొల్లపల్లి, దేవరగుంట, యనమదల, అన్నవరం, కాటేరిపాడు, అడవినెక్కలం, గోపవరం, ఈదులగూడెం, ఈదర, కొలవారిగూడెం, ముసునూరు, చెక్కపల్లి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. నూజివీడు పరిధిలో ఎస్‌జిటిలు 60 మందికి స్థాన చలనం కలిగింది. 19 మంది స్కూల్ అసిస్టెంట్లు (ఆంగ్లం) ఉద్యోగోన్నతి పొందారు. మరో 40 మంది వివిధ పాఠ్యాంశాలు బోధించే వారు బదిలీ అయిన వారిలో ఉన్నారని, డిఇఓ తాహెరా సుల్తానా తెలిపారు. బదిలీ అయిన వారు వెబ్‌సైట్‌లో ఉత్తర్వుల కాపీని డౌన్‌లోడ్ చేసుకుని కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో జాయిన్ అవ్వాలని ఆమె సూచించారు. 202 మంది బదిలీ రిక్వెస్ట్ కోరారని డిఇఓ తెలిపారు.

చినుకు జాడేది..!

వరుణుడి రాక కోసం రైతులు ఎదురుచూపు

ఖరీఫ్‌పై తీవ్ర ప్రభావం

ఈసారి స్వల్పకాలిక వరి రకాలు మేలు : వ్యవసాయాధికారుల సూచన

ప్రజాశక్తి - కాళ్ల

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే వరుణిడి జాడ లేకపోవడంతో రైతులు నారుమడులు వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ ఆలస్య అవకాశం ఉంది. ఇటీవల ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలోని డెల్టా శివారు కాలువలకు నీరు వచ్చింది. ఈ క్రమంలో వరుణిడి రాక కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. డెల్టాలో తొలకరి వర్షాలు పలుకరించిన తర్వాతే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఇంకా ఎండలు మండిపోతుండటంతో నారుమడులు వేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఈనెల రెండోవారం వచ్చినా చినుకుజాడ లేకుండాపోయింది. ఆకాశంలో దట్టంగా మేఘాలు అలుముకుంటున్నా తేలిపోతున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తే గానీ వర్షాలు పూర్తిస్థాయిలో కురిసే అవకాశం కనిపించడం లేదు. రోహిణి కార్తె ముగిసి మృగశిర నడుస్తుంది. దీంతో జిల్లాలో వర్షాలు కురిసే సమయం వచ్చింది. రుతు పవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకాయి. మరో నాలుగైదు రోజుల్లో రాష్ట్రాన్ని తాకే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న రైతులు వరుణుడు రాక కోసం ఎదురుచూస్తున్నారు. చినుకు పడితే విత్తనాలు చల్లేందుకు వీలుగా నారుమడులు సిద్ధం చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు విక్రయిస్తున్నారు. ఈ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం సుమారు 5.50 లక్షల ఎకరాల్లో సార్వా సాగు చేపట్టనున్నారు. మెట్ట, డెల్టా ప్రాంతాల్లో రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలు ముఖం చాటేయడంతో మెట్ట, డెల్టా రైతాంగానికి ఎదురుచూపులు తప్పని పరిస్థితి నెలకొంది. ఈనెల మొదటివారంలో కురిసే వర్షాల ఆధారంగా సాగు చేపడతారు. కానీ ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతుండటం, వర్షాలు కురవకపోవడంతో సార్వాసాగు ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. తొలకరి వర్షాలు ఆలస్యం కావడంతో సార్వాసాగుకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఏటా ప్రకృతి వైపరీత్యాల బారినపడి రైతులు వరి పంటను నష్టపోతున్నారు. ఈనెల రెండో వారం వచ్చినప్పటికీ వర్షాలు కురవలేదు. 15 తర్వాత నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అంచనా. ఆ తరువాతే సార్వాసాగు పనులు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది.

త్వరగా నారుమడులు వేసుకోండి

ఈనెల 15లోపు నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, స్వల్పకాలిక వరి పంటలను ఎంపిక చేసుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ జెడి జెడ్.వెంకటేశ్వరరావు ఇటీవల ప్రకటించారు. కేవలం కాలువనీటిపై ఆధారపడి నారుమడులు వేస్తే మొలక శాతంలో బాగా తేడాలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం నిత్యం 40 డిగ్రీల నుంచి 42 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వరి విత్తనాలు వేసిన తర్వాత నారుమడిని ఆరబెడతారు. ఆ సమయంలో అధిక వేడి వల్ల వేసిన విత్తనాల్లో అధిక శాతం మొలకెత్తే అవకాశం ఉండదు. అందుకే తొలకరి తర్వాతే సార్వా సీజన్ ప్రారంభించడానికి డెల్టా రైతులు సాంప్రదాయంగా భావిస్తుంటారు. ఈ క్రమంలో తొలకరి జల్లుల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

స్వల్పకాలిక వరి రకాలు మేలు

ఖరీఫ్‌లో కేవలం స్వల్పకాలిక రకాల విత్తనాలను మాత్రమే రైతులు వేస్తే త్వరగా పంట చేతికి వస్తుంది. స్వల్పకాలిక రకాలైన ఎంటియు 1064, 1061 వరి రకాలు (140 రోజులు) ఈ సీజన్‌లో వేసుకునేందుకు ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయి.

15వ తేదీ దాటాకే నారుమడులు

కొల్లి శ్రీనివాస్, కౌలు రైతు, దొడ్డనపూడి, పశ్చిమగోదావరి

పంట కాలవల్లోకి నీటిని విడుదల చేశారు. వారం రోజుల్లో నీరు పుష్కలంగా అందిస్తామని అధికారులు చెబుతున్నారు. ఎండల వల్ల నారుమడులు సిద్ధం కాలేదు. ఈనెల 15వ తేదీ దాటాల్సిందే. ప్రారంభంలోనే సాగు జాప్యమైతే తుపానులు, భారీ వర్షాలకు వరి పంటకు నష్టం తప్పదు.

అందుబాటులో విత్తనాలు

శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఎడిఎ, ఆకివీడు, పశ్చిమగోదావరి

ఎంటియు 1318 వరి రకం(155రోజులు) నారుమడులు వేసుకోవాలి. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. స్వల్పకాలిక వరి రకాలైన(145 రోజులు) ఎంటియు 1061, 1064, 1029 స్వర్ణ వరి రకాలు కావాల్సిన రైతులు డబ్బు చెల్లిస్తే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తాం. వర్షం పడితే సీజన్ ప్రారంభమవుతుంది.

ముమ్మరంగా వేసవి దుక్కులు
తొలకరి జల్లులు కోసం రైతులు ఎదురుచూపు

ముదినేపల్లి: మండలంలోని మెట్ట ప్రాంత రైతులు దుక్కుల పనుల్లో నిమగ్నమయ్యారు. భూముల్లో ఎత్తుపల్లాలు సరిచేసే పనులు ముమ్మరంగా చేపట్టారు. పొలాల చదునుకు వేసవి అనువుగా ఉండటంతో చాలమంది రైతులు మే నెలలోనే మెట్టదుక్కులు చేపట్టారు. తొలకరి వర్షాలకు ముందు రైతులు వేసవి దుక్కులు చేపట్టడం వల్ల పంటలకు ప్రతికూల ఫలితాలు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. లోతైన దుక్కులతో నేలలోని తేమ సంరక్షించబడుతుంది. వరి పొలాలకు మేలు కలిగించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి గణనీయంగా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. మెట్ట దుక్కుల కారణంగా తొలకరిలో కురిసే వర్షపు నీరంతా నేలలోకి ఇంకుతుంది. అప్పుడు వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందొచ్చని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో రెండు దఫాలుగా మెట్టదుక్కులు దున్నిన రైతులు నారుమడులు వేసేందుకు చేలను సిద్ధం చేశారు. వర్షాలు పడితే విత్తనాలు చల్లేందుకు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. ఈనెల ఏడో తేదీన విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి పంట కాలువలకు అధికారులు నీరు విడుదల చేసినప్పటికీ ఆ నీరు మండలంలోని పోల్‌రాజ కెనాల్, సిబి కెనాల్స్‌కు చేరుకోవడానికి మరోవారం పట్టొచ్చని రైతులు చెబుతున్నారు. ఈలోగా తొలకరి వర్షాలు పడితే సిద్ధం చేసిన చేలల్లో విత్తనాలు వెదచల్లేందుకు, నారుమడులు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. మండలంలోని రైతులు ఈసారి కూడా అధిక సంఖ్యలో వెదజల్లే పద్ధతిలోనే వరిసాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జూన్ ప్రారంభమమై పదిరోజులుగా గడుస్తున్నా వర్షాల జాడ కనిపించడంలేదు. ప్రతిఏటా జూన్ మొదటి వారంలో కేరళను రుతుపవనాలు తాకేవి. నైరుతి రుతుపవనాలు ఈసారి ముఖంచాటేయడంతో ఎప్పుడు వర్షాలు కురుస్తాయో తెలియక రైతులు మదనపడుతున్నారు. పంటల కోసం నేలను సిద్ధం చేసిన రైతన్న వానలు ఎప్పుడు కురుస్తాయో తెలియక అయోమయంలో ఉన్నాడు. ఇప్పటికే దుక్కులు దున్ని వానల కోసం ఎదురుచూసే రైతన్నలు తొలకరి జల్లులు కోసం ఎదురుచూస్తున్నాడు. అనుకున్న తేదీ దాటినప్పటికీ రుతుపవనాల జాడ కనిపించడంలేదు. జూన్ నెల ప్రారంభమై పది రోజులు గడిచినప్పటికీ తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షాలు కోసం మరికొన్ని రోజులు పాటు నిరీక్షించక తప్పదనేపిస్తుంది. రుతుపవనాల ఆలస్యంతో ఈఏడాది వర్షాలు కూడా తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మండలవ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరిసాగు రైతులు చేపడుతున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి బొర్రా వేణుమాధవ్ తెలిపారు.

రిలే దీక్షలు చేపట్టిన నాయకులు

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని

సిపిఎం ఆధ్వర్యాన రిలే దీక్షలు

ప్రజాశక్తి - వేలేరుపాడు

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో రిలే దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు ప్రారంభించారు. అనంతరం దీక్షనుద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, దుర్గారావు మాట్లాడుతూ ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో మండలంలోని ప్రజానీకం సర్వం కోల్పోతున్నప్పటికీ పునరావాసం, పరిహారం విషయంలో ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని విమర్శించారు. గత వరదలు మండలంలో ఉన్న ప్రజానీకాన్ని అతలాకుతలం చేశాయని గుర్తు చేశారు. గత ఏడాది సిఎం జగన్ వరదల సమయంలో వచ్చి సాయం ప్రకటించినప్పటికీ నేటికీ పూర్తిస్థాయిలో అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే రెండు, మూడు నెలల్లో మళ్లీ వరద వచ్చే ప్రమాదం ఉందని భయాందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు గోదావరి వరదల నుండి నిర్వాసితులను రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్ఆర్ పరిహారం ఇవ్వకుండా పునరావాస కేంద్రాలకు కొంతమందిని తరలించారని, వారికి నేటికీ పరిహారం అందకపోవడంతో జీవించడానికి వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కాలనీలో మౌలిక వసతుల కొరత ఉందన్నారు. పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాకే తరలించాలని డిమాండ్ చేశారు. గ్రామాలు ఖాళీ చేయించే నాటికి 18 సంవత్సరాలు పూర్తయినా యువతకు అందరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 తేదీన అల్లూరి జిల్లా నెల్లిపాక నుండి విజయవాడ వరకూ సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న 'పోలవరం పోరుకేక మహా పాదయాత్ర'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్ర మండలానికి ఈనెల 26వ తేదీన వస్తుందని, నిర్వాసితులందరూ యాత్రలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు వేలేరుపాడు ఎస్‌సి కాలనీవాసులు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో కారం వెంకట్రావు, కొత్త, వెంకటేశ్వర్లు, ఊకే మహాలక్ష్మి, రాజు, మైబు రాజారావు, టి.శ్రీను, సోడే ప్రసాద్, కురిమెల్ల, శ్రీను, గుమ్మాల నర్సయ్య ఉన్నారు.

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఏలూరు

సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరం కలిసికట్టుగా కృషిచేద్దామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశంపై స్థానిక కలెక్టరేట్ నుండి ఫైర్ స్టేషన్ వరకూ నిర్వహించిన అవగాహన ర్యాలీని సోమవారం కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్ది, ఉజ్వల భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లాలోని వ్యాపార సంస్థలపై, షాపులపై దాడులు చేసిన ఎవరైనా బాలలను కార్మికులుగా నియమించుకుంటే, వారిపై కేసులు నమోదు చేస్తామని, ఇందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. తమ పరిసరాల్లో బాల కార్మికులు, భిక్షాటన చేసే బాలలను గుర్తిస్తే వెంటనే 9492555084 నెంబర్‌కి ఫోనే చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశంపై ప్రజలకు విస్తత అవగాహన కలిగించేందుకు ఈనెల ఒకటో తేదీ నుండి 30వ తేదీ వరకూ అవగాహన మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా జిల్లాలోని మండల, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. బాల కార్మిక వ్యవస్థలేని భావి భారతాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పద్మావతి, డిసిపిఒ సిహెచ్.సూర్య చక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్, కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎ.రాణి, ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాధరావు, సోషల్ వర్కర్ మమత, శ్రీకాంత్ కౌన్సిలర్ బాలస్వామి, అవుట్ రీచ్ వర్కర్ భార్గవి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో పసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ ఎవిఎస్ఎస్.మూర్తి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, డిప్యూటీ కలెక్టర్లు సూర్య నారాయణరెడ్డి, సత్యనారాయణతో కలిసి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు, పేదలందరికి ఇళ్ల పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పింఛన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలకు సంబంధించి మొత్తం 236 అర్జీలు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న స్పందనలో దరఖాస్తు అర్జీదారులకు సంతృప్తిస్థాయిని పెంచే విధంగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. తప్పనిసరిగా గడువులోగా సమస్య పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో..

జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్‌పి డి.మేరీప్రశాంతి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు పలు అర్జీలను అందించారు. అనంతరం ఫిర్యాదుదారులకు ఏలూరు శ్రీసత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ కొంతమంది సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అకౌంట్‌కు కెవైసి చేయాలని చెప్పి పంపించే మెసేజ్‌లు, ఓటరు కార్డుకు పాన్ కార్డును జతపరచాలని చెప్పే అపరచితులకు సమాచారం అందిస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ అవుతుందని సూచించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర సంస్థల్లో బహుమతులు వచ్చాయని వస్తున్న మెసేజ్‌ల పట్ల, తమరు బుక్ చేయనటువంటి విషయాలపై క్యాన్సిల్ చేయాలంటే ఒటిపి వస్తుందని చెప్పి ఆ ఒటిపి నెంబర్ అడిగే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

వడ్లపట్లలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని అంబరుపేట గ్రామపంచాయతీ పరిధిలోని వడ్లపట్ల గ్రామంలో ఉంగుటూరు ఎంఎల్ఎ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి పర్యటించారు.. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లారు. ప్రజలతో మమేకమయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం వారి సంక్షేమానికి చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. వయోభారంతో ఆయనను కలవటానికి అవకాశం లేని వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దీపిక, ఎంపిటిసి సభ్యులు కో-ఆప్షన్ సభ్యులు షేక్ ఆజాం పాల్గొన్నారు.

'పోలవరం' కాంటూరును సవరించాలి

నిర్వాసితులకు పరిహారం, ప్రాజెక్టు పూర్తిచేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే

జీపుజాతా ప్రారంభంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ


మాట్లాడుతున్న కె.నారాయణ

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం బాధ్యత, నిర్వాసితులకు పూర్తి నష్టపరిహారం కేంద్రమే భరించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కుక్కునూరులో సిపిఐ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జీపుయాత్ర సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నారాయణ విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు తాగునీరు, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యి రాష్ట్రం సశ్యశ్యామలమవుతుందన్నారు. గత ఎన్నికల సందర్భంగా మోడీ అమరావతి శంకుస్థాపనకు మట్టి, నీరు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసగించారన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించకుండా, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించకుండా ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. గతంలో రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 150 అడుగుల ఎత్తులో ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారని, ప్రస్తుతం 135 అడుగుల ఎత్తుకు కుదించడంతో మినీ రిజర్వాయర్‌గా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రాజెక్టు ఎత్తు 41.05కు కుదించడం నిర్వాసితులను తగ్గించి నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేయడానికేనని విమర్శించారు. తక్షణం కాంటూరు పరిధిని సవరించాలన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలపై పెట్టే దృష్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో పెట్టి ఉంటే విభజన హామీలు, ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో సహా అన్ని పూర్తయ్యేవని తెలిపారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి సత్వరమే ప్రాజెక్ట్ పూర్తిచేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆది నుంచి ఆటంకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎక్కడైనా అభివృద్ధి జరగాలంటే కొంతమంది త్యాగాల ఫలితంగానే సాధ్యమన్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రాజెక్టు ఎత్తును 41.05కు కుదించడంలో కుట్ర దాగి ఉందన్నారు. లక్షా ఆరు వేల కుటుంబాలకు చెల్లించాల్సిన నష్టపరిహారం పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలన్నారు. నిర్వాసితులు ఖాళీ చేసేనాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐటియుసి కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు, రాష్ట్ర సమితి సభ్యులు ఎమ్‌డి మునీర్, సిపిఎం జిల్లా కార్యదర్శి అరటి కట్ల రవి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, సహాయ కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, వేలేరుపాడు మండల కార్యదర్శి బాడిస రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబా, బత్తుల వెంకటేశ్వరరావు, కంచర్ల గురవయ్య, ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం ధారయ్య, జిల్లా సమితి సభ్యులు తొర్లపాటి బాబు, అయితా సురేష్, పాల్గొన్నారు.

పాఠశాలలో చైర్‌పర్సన్ నాగలక్ష్మి తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక జెడ్‌పి బాలుర పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆకస్మిక తనిఖీ చేశారు. సోమవారం వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి పున:ప్రారంభం అవుతున్న సందర్భంగా మౌలిక వస్తువులపై పరిశీలన చేశారు. పాఠశాలలో తరగతి గదులు, బెంచీలు, కుర్చీల నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తగిన నాణ్యత పాటించాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుకు సూచించారు. ఈ సందర్భంగా మేక సుబ్రహ్మణ్యం పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట కోసం బహుకరించిన స్టవ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి చేతులమీదుగా పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బత్తిన చిన్న, విశ్రాంత ఉపాధ్యాయులు ఎండి ఉమర్ అలీ, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేస్తున్న చైర్‌పర్సన్ నాగలక్ష్మి

అక్రమ లే అవుట్లపై స్పందనలో ఫిర్యాదు

క్షేత్రస్థాయిలో అధికారుల విచారణ


లే అవుట్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు పంచాయతీ పరిధి కొత్త ఉంగుటూరులో క్వారీ గోతులను పూడ్చి చదును చేసిన 2.20 ఎకరాల్లో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు వేశారని, వాటిని అరికట్టాలని ఈ నెల తొమ్మిదో తేదీన స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై మండల పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్, ఉంగుటూరు పంచాయతీ కార్యదర్శి కాకర్ల గిరిధర్, సచివాలయ ఉద్యోగులు సోమవారం సంఘటనా స్థలాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లేఅవుట్‌కు అనుమతులు ఉన్నాయా ఎకరానికి పది శాతం కామన్ సైట్ పంచాయతీకి ఎక్కడ కేటాయించారు.. అంతర్గత రోడ్లు 30 అడుగులు ఉన్నాయా..తదితర అంశాలను ఆరా తీశారు. అన్నీ పరిశీలించాక లే అవుట్లకు అనుమతులు లేవని గుర్తించినట్లు ఇఒపిఆర్‌డి వెల్లడించారు. కామన్ సైట్ వదలకుండా 30 అడుగుల రోడ్లు లేకుండా లేఅవుట్ వేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అనుమతుల కోసం వెంటనే దరఖాస్తులు చేసుకుంటే త్వరితగతిన అనుమతుల వచ్చేలా పంచాయతీ అధికారులు అన్ని సహకారాలు అందిస్తారని ఇఒపిఆర్‌డి షంషుద్దీన్ భూయజమానికి వివరించారు. అప్పటి వరకూ స్థలాలు అమ్మకుండా హెచ్చరిక బోర్డులు పెట్టాలని కార్యదర్శి గిరిధర్‌ను ఇఒపిఆర్‌డి ఆదేశించారు.

14వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో 14 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ఖరీఫ్ ప్రణాళికను రూపొందించినట్లు వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. దీనిలో భాగంగా రైతులను ప్రోత్సహించేందుకు రైతు భరోసా కేంద్రాల వద్ద బిపిటి 5204, ఎంటియు 1061, 1064, 1121, 1224, 7029 వరి విత్తనాలను రాయితీపై అందించేందుకు సిద్ధం చేశామన్నారు. కేజీ ఒక్కింటికి ఐదు రూపాయల రాయితీపై రైతులు వీటిని కొనుగోలు చేయవచ్చని సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పిఎల్ 1100, ఎంటియు 1318 రకాల సాగు రైతులకు ప్రయోజనకారిగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. భూసారం పెంచేందుకు, ఎరువుల వాడకం తగ్గించేందుకు రైతులకు 50 శాతం సబ్సిడీపై పిల్లి పెసర, జీలుగు విత్తనాలను పంపిణీ చేశామన్నారు. రైతులు ఇప్పటివరకు పది క్వింటాళ్ల పిల్లి పెసర, 15 క్వింటాళ్ల జీలుగు విత్తనాలను కొనుగోలు చేశారని వివరించారు. ప్రస్తుత సీజన్‌లో కౌలు రైతులకు 3600 పంట సాగు హక్కు పత్రాల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. మండల వ్యాప్తంగా నాలుగు వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నారని, గతేడాది వీరిలో 3300 మందికి పంట సాగు హక్కు పత్రాలను అందించామన్నారు. కౌలు రైతులు ఇక్రాప్ విధానంలో వీటి వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందుకోవచ్చని తెలిపారు. మండలంలో 740 వరకు మట్టి నమూనాల పరీక్షలు లక్ష్యంగా నిర్ణయించుకున్నామన్నారు. రైతులు వీటి ఫలితాల ఆధారంగా సాగు, ఎరువుల వాడకం, ఇతర అంశాలను అమలు చేయడం ద్వారా నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులను సాధించవచ్చని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి

ప్రజాశక్తి - మండవల్లి

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. ప్రపంచ బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మండవల్లిలో మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి తల్లిదండ్రులు చొరవ తీసుకుంటేనే బాలలకు భరోసా ఏర్పడుతుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలను రూపొందిస్తున్నా వారి జీవితాలను మాత్రం మార్చలేకపోతున్నాయన్నారు. కనీస అవసరాల కోసం సరిపడా ఆదాయం దొరకని అనేక కుటుంబాలవారు తమ పిల్లలను పనుల్లో పెట్టి వారితో పనులు చేయిస్తున్నారన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిబంధనల ప్రకారం అందకపోవడం కూడా ఒక కారణమన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక స్పృహ కలిగి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు కూడా బాల కార్మికులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు

మొక్కలే ప్రగతికి సోపానాలు

ప్రజాశక్తి - కైకలూరు

మొక్కలే ప్రగతికి సోపానాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టారు. నేతలు మొక్కలను నాటి నీరు పోశారు. ఈ విధంగా రోడ్డు పక్కన ఉన్న గోడకు ఫెన్సింగ్ వాల్ ఏర్పాటు చేసి మొక్కలు నాటి సుందరంగా తయారు చేసిన ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, తహశీల్దార్ శ్రీకృష్ణకుమారిని నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణ మోహన్, సర్పంచి దానం మేరీ నవరత్న కుమారి, సయ్యపరాజు గుర్రాజు, ఆచంట సర్పంచి నరహరిశెట్టి నరసింహరావు, మండవల్లి తహశీల్దార్ సతీష్, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

నాలుగు మండలాలకు ఆరెంజ్ అలర్ట్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో మంగళవారం, బుధవారం వడగాలులు వీస్తాయని ఏపి విపత్తు నిర్వహణ సంస్థ (APSDMA) తెలిపింది. నూజివీడు మండలంలో 42.8, ఆగిరిపల్లి మండలంలో 42.9, చాట్రాయి మండలంలో 42.7, ముసునూరు మండలంలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుందని సూచించింది. నూజివీడు పరిసర ప్రాంతాల ప్రజానీకం వడగాలులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ విపత్తు నిర్వహణ సంస్థ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

విద్యార్థులకు పలకలు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు హెచ్.హన్మానాయక్ ఆధ్వర్యంలో సింజెంటా కంపెనీ ప్రతినిధులు సోమవారం పలకలు అందించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ బి.చెన్నారెడ్డి, కెవిఎన్.ప్రసాద్, మురళీ, దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని బుసరాజుపల్లి ఆశ్రమ పాఠశాలలో చదివే కొల్లాయిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని మెడియం మంగ సంవత్సరం క్రితం వైద్యం వికటించి మృతి చెందింది. ఈ క్రమంలో సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును చిన్నారి తల్లి మెడియం వెంకాయమ్మకు సోమవారం అందించారు. చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆర్థిక సహాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎంఎల్ఎ తెల్లం బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. సిఎం జగన్, ఎంఎల్ఎ బాలరాజుకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయమ్మ, వైస్ ఎంపిపి కుక్కల వరలక్ష్మి, తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. మండలంలోని అల్లూరులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ దేవాలయానికి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మండలంలోని పెనుమల్లిలో నిర్మిస్తున్న శ్రీకోదండ రామాలయానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు శీలం రామకృష్ణ, జంగం వెంకటేశ్వరరావు, పెనుమల్లి గ్రామ ఎంపిటిసి సభ్యులు కొండలరావు, ఉపసర్పంచి అనగాని మల్లేశ్వరరావు, గ్రామ సొసైటి ఛైర్మన్ ముత్యాల రాంబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

పజాశక్తి - ముసునూరు

వరివంగడ విత్తనాలు రైతు భరోసా కేంద్రంలో ఆందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎంటివి -1061 వరి విత్తన రకం ఆందుబాటులో ఉన్నాయని, 30 కేజీల బస్తా ధర రూ.1143లు కాగా, సబ్సిడీ కేజికి రూ.5 చొప్పున రూ.150 పోగా రూ.993 ప్రతి బస్తాకు ధర చెల్లించాలని చెప్పారు. పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు ఫోన్ నెంబర్‌తో వచ్చి కొనుగోలు చేయవచ్చని తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వాహనదారుల ప్రాణాలతో చెలగాటం

నల్ల డబ్బాలే ప్రమాద హెచ్చరికలు
కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
కాసుల మోజులో అధికారులు
ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్న ప్రజలు

ప్రమాద హెచ్చరికలుగా ఏర్పాటు చేసిన నల్ల డబ్బాలు

ప్రజాశక్తి - మండవల్లి

విస్తరణ పనులు వాహనదారుల పాలిట శాపంగా మారాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పనుల వల్ల ప్రమాదం ఏ రూపంలో ముంచుకొస్తుందో తెలియక వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకుండా సూచక బోర్డులను ఏర్పాటు చేయడంలో అటు అధికారులు ఇటు పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాంట్రాక్టర్ ఆర్థిక ఎదుగుదలపై అధికారుల్లో ఉన్న చిత్తశుద్ధి ప్రమాదాలను నివారించడంలో లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కాసుల ముసుగులో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు స్పష్టం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే ప్రమాదకరమైన మలుపు వద్ద భారీ గొయ్యి తవ్వి పనులు నిర్వహిస్తూ సూచక బోర్డులను ప్రమాదం జరగకుండా భారీ కేడ్లను కూడా ఏర్పాటు చేయని వైనం. దీంతో ప్రమాదం సంభవిస్తే ఎవరిది బాధ్యత అంటూ వాహనదారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జాతీయ రహదారిపై కొర్లపాడు వద్ద ప్రమాదకరమైన మలుపు ఉంది. ఆ మలుపు వద్ద ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి మృత్యువాత పడినవారు కొందరైతే, క్షతగాత్రులుగా మిగిలినవారు మరికొందరు. అయితే రహదారి అభివృద్ధి పేరుతో కాంట్రాక్టర్ ఆ ప్రాంతంలో సుమారు 15 అడుగుల లోతు గొయ్యిని తవ్వేసి పనులు నిర్వహిస్తున్నాడు. ఆ ప్రాంతంలో పనులు నిర్వహిస్తున్నట్లు తెలియజేసే సూచక బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్‌కు అధికారులతో పాటు రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉండడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తారాస్థాయికి చేరింది. దీంతో మలుపు వద్ద నల్ల రంగు వేసిన ఇనుప డబ్బాలో పెట్టిన కర్రలకు ప్లాస్టిక్ పేపర్లు కట్టిన తాడును కర్రలకు కట్టి చేతులు దులిపేసుకున్నాడు. దీంతో ప్రమాదాలు జరగకుండా ప్లాస్టిక్ పేపర్లు నల్ల రంగు డబ్బాలు ఎంతవరకు కాపాడతాయంటూ వాహనదారులు, ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇదేవిధంగా సూచక బోర్డులు పెట్టకపోవడంతో కల్వర్టు కోసం తవ్విన గుంటలో కారు పడగా కారు ధ్వంసమై ఒక కుటుంబానికి ప్రాణాపాయం తప్పి స్వల్పగాయాలతో బయటపడిన సంఘటన ప్రత్తిపాడు రోడ్డు వద్ద చోటు చేసుకుంది. ఇదిలా ఉంటే కొర్లపాడు వద్ద ఉన్న మలుపు దగ్గరకు రాగానే వాహనదారులు సహజంగానే భయాందోళన చెందుతుంటారు. అయితే ఇప్పుడు రాత్రి వేళల్లో ప్రమాదకరమైన మలుపు ప్రాంతంలో ఎదురు వచ్చే వాహనాల హెడ్‌లైట్ల కాంతిలో ఆ నల్ల డబ్బాలు కనపడక మరిన్ని ప్రమాదాలు జరిగే పరిస్థితులు నెలకొన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెల్మెట్ లేదని, ముగ్గురు ప్రయాణిస్తున్నారని, లైసెన్స్ లేదని విధిగా జరిమానాలు విధించే పోలీసులు కొర్లపాడు మలుపు వద్ద నిర్లక్ష్యంగా నల్ల డబ్బాలను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరిగే స్థాయిలో పనులు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాసుల ముసుగులో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ వాహనదారులను ప్రమాదాల బారిన పడవేయడం ఎంతవరకు సమంజసమని వారు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రమాదం సంభవించక ముందే స్పందించి విస్తరణ పనులను నిలుపుదల చేసి పనులను నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌పై, ముడుపుల మత్తులో ఉన్న అధికారులపై చర్యలు తీసుకొని ప్రమాదాల బారి నుంచి వాహనదారులను, ప్రజలను కాపాడాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై ఎన్‌హెచ్‌డి సత్యనారాయణను వివరణ కోరగా కొర్లపాడు మలుపు వద్ద సూచికబోర్డులు పెట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నీటిలో సేదతీరుతున్న గ్రామ సింహం

వేసవి తాపం.. నీటిలో ఉపశమనం

ప్రజాశక్తి - మండవల్లి

రోహిణి కార్తె ప్రభావంతో ఎండలు మండుతున్నాయి. ఎండ వేడిమితో ఉక్కపోతతో ప్రజలతో పాటు మూగజీవాలు కూడా అల్లాడిపోతున్నాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు చూస్తున్నాయి అనడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండవేడిమికి ఉక్కపోత తోడవ్వడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. ఉక్కపోత, వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఏసీలను, ఫ్యాన్లను, చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. అయితే ఈ గ్రామ సింహం మాత్రం ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు రహదారి డ్రెయినేజీ పక్కనే ఉన్న మురుగుగుంటను ఆశ్రయించింది. గంటలసేపు ఆ నీటిలో ఆడుకుంటూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొంది అక్కడ నుంచి హాయిగా వెళ్లిపోయింది.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మైనర్లకు మోటారు సైకిళ్లు ఇస్తే వారి తల్లిదండ్రి, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ ఎస్ఐ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఎస్‌సి డి.మేరీప్రశాంతి, ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలో వాహన తనిఖీలు చేపట్టారు. నగరంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాహన రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు తనిఖీ చేశారు. నగరంలో బాలలు అధికంగా మోటారు సైకిళ్లు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మోటారు సైకిళ్లు వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. నగరంలో మైనర్లు వాహనాలు నడిపితే చట్టం మేరకు చర్యలు తప్పవన్నారు. మోటారు సైకిళ్లు పిల్లలకు ఇవ్వటం వల్ల వచ్చే అనర్థాలను వారి తల్లిదండ్రికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపుతున్నామని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

ప్రజాశక్తి - భీమడోలు


మరమ్మతు పనులు చేపడుతున్న ట్రాన్స్‌కో ఎఇ

భీమడోలు గ్రామ విద్యుత్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ట్రాన్స్ కో భీమడోలు ఎఇ రామస్వామి తెలిపారు. దీనిలో భాగంగా గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న 250 కెవి సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో ఉన్న సుమారు 350కి పైగా విద్యుత్ సర్వీసులకు (దాదాపుగా గ్రామంలో సగం) ఈ ట్రాన్స్‌ఫారం ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యానికి మించి అక్కడ ఉన్న సర్వీసులకు తోడు, కాలం చెల్లిన కండక్టర్లు, స్విచ్ బోర్డులు ఇతర పరికరాల కారణంగా ఆ ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. లో ఓల్టేజి ఆ ప్రాంతంలో నిత్య సమస్యగా మారింది. ఇటీవల కాలంలో ఆ సమస్య తీవ్రం కావటంతో ప్రజల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై స్పందించిన ట్రాన్స్ కో అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ మెరుగుపరిచే చర్యలతో పాటు, పాడైపోయిన కండక్టర్‌లో స్విచ్ బోర్డులు ఇతరాలను సోమవారం నూతనంగా అమర్చినట్లు ట్రాన్స్ కో ఎఇ తెలిపారు. ఈ ప్రాంతంలో మరొక అదనపు ట్రాన్స్ పార్మర ఆవశ్యకత గురించి ఉన్నతాధికారి దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన చర్యల కారణంగా ఆ ప్రాంతంలో విద్యుత్ కోతల సమస్య లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైనట్లు ఎఇ తెలిపారు.

'అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాలనడం తగదు'

ప్రజాశక్తి - మండవల్లి

రాజ్యాంగం ద్వారా హక్కులు కల్పించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాలని రోడ్డుమీద బైఠాయించి ఆందోళన చేయడం సరికాదని, దీనిని మాల మహాసేన తీవ్రంగా ఖండిస్తుందని మాల మహాసేన జాతీయ ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తిరుమలయ్యపాలెంలో అసాంఘిక శక్తులు రాజ్యం ఏలుతున్నాయన్నారు. కుల వివక్షతకు పాల్పడుతూ దళితులను చిన్న చూపు చూస్తున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించాలని ఆందోళన చేపట్టడమే ఇందుకు నిదర్శమన్నారు. అంబేద్కర్ విగ్రహం తొలగించాలని నిరసన చేస్తున్న వారిని వదిలిపెట్టి దళితులపై పోలీసులు విరుచుకుపడి కాళ్లు, చేతులు విరగగొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దళితులపైన, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలపై సృష్టిస్తున్న అల్లర్లను అణచివేసి శాంతి భద్రతలను పరిరక్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తిరుమలయ్య పాలెంలో దళితుల కాళ్లు చేతులు విరగొట్టిన పోలీసులుపై చర్య తీసుకుని వివక్షతను రెచ్చగొట్టి విధ్వంసాన్ని సృష్టిస్తున్న అసాంఘిక శక్తులపై చర్యలు చేపట్టి దళితులను రక్షించాలని, బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. లేకపోతే దళితులంతా ఏకమై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కార్యక్రమాలు చేపట్టి దళితుల సత్తా చూపుతామని ఆయన హెచ్చరించారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం గోదావరి ఓల్డేజ్ హోంలో వృద్ధులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన శ్రీనివాస్, తన భార్య గుగ్గులోతు సుజాత మూడో వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు కూతురు కుష్మిత, వర్షిత, మామ నాయక్ అత్త కుమారి కలిసి ఓల్డేజ్ హోంలో వృద్ధులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భోజనం చేస్తున్న వృద్ధులు

విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేత

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని అయ్యవారి రుద్రవరం సర్పంచి బోనం శేషగిరి అన్నారు. స్థానిక పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యలో రాణించాలనే సంకల్పంతో పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను ఏర్పాటు చేశారన్నారు. విద్యాభివద్ధికి పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతో జగనన్న విద్యా దీవెన కిట్లను అందించడంతో పాటు అమ్మ ఒడి పథకాన్ని తీసుకువచ్చి నేరుగా తల్లి ఖాతాలోనే సొమ్మును జమ చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచి ఇంటి నాగరాజు, ఎస్ఎంసి సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీమడోలు :ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలని, విద్యావ్యాప్తికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగ పరుచుకోవాలని భీమడోలు సర్పంచుల ఛాంబర్ అధ్యక్షురాలు, భీమడోలు సర్పంచి పి.సునీతమాన్‌సింగ్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి...శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచి మాట్లాడుతూ అర్హులందరికీ జగనన్న విద్యా కానుకలతో పాటు అమ్మఒడి, ఇతర ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో ఏడు నుంచి పదో తరగతి వరకు 900 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరికి అదనంగా ఆరో తరగతిలో మరో 200 మంది వరకు చేరే అవకాశం ఉందని, వీరందరితో కలిపి పాఠశాలలో చదువుకునే విద్యార్థుల సంఖ్య గత సంవత్సరం కన్నా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పి.ప్రియదర్శిని, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ జి.బాబురావు, రామకుర్తి నాగేశ్వరరావు మాట్లాడారు.

ముసునూరులో...

బుట్టాయగూడెం : స్థానిక హైస్కూలులో విద్యార్థులకు విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సోమవారం ప్రారంభించారు. ఆయన విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పేద విద్యార్థులు ఇటువంటి పథకాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, వైస్ ఎంపిపి కుక్కల వరలక్ష్మి, ఎంఇఒ తెల్లం బాబురావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాదేవి, తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి, స్థానిక సర్పంచి తెల్లం వెంకాయ మ్మ, విద్యార్థుల తల్లదండ్రులు, వైసిపి నాయకులు పాల్గొ న్నారు.

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూలులో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను మున్సిపల్ ఛైర్మన్ రామిశెట్టి త్రివేణి దుర్గ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పిల్లా చరణ్, హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు : రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుక కిట్లు ఉపయోగించుకుని ఉన్నత చదువులు చదవాలని జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, సర్పంచి కొండేటి విజయలక్ష్మి, డివైఇఒ సేవినాయక్, ప్రధానోపాధ్యాయులు ఎ.సునీల, వైసిపి నాయకులు రాపర్ల సుబ్బారావు, టి.రంగరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రత్నమాల పాల్గొన్నారు.

ముదినేపల్లి : సిఎం జగన్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అల్లూరు జెడ్‌పి హైస్కూలులో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డెరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, రాచూరి రాధా, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ, గ్రామ ఎంపిటిసి సభ్యులు రెడ్డి సతీష్‌బాబు, నాయకులు కె.విష్ణువర్ధన్, కొరగుంటపాలెం సర్పంచి పేరే రామకృష్ణ, ఆలయ ఛైర్మన్ జి.సుధారాణి, కె.మైనర్‌బాబు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల ఎంపియుపి స్కూల్‌లో, ఏరియా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యకానుక కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల గ్రామ సర్పంచి కుంటం స్వర్ణలత సతీష్, ఎంపిటిసి-1 రుద్ర సూర్య కళా వెంకట శివాజీ, వైసిపి టౌన్ ప్రెసిడెంట్ ఉక్కుర్తి వెంకట్రావు, గ్రామపంచాయతీ బోర్డు సభ్యులు చిలుకూరి నాగ సుబ్రహ్మణం, అచ్యుత జగన్మోహిని, ఏసుబాబు పాల్గొన్నారు.

చాట్రాయి : ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ప్రారంభమైన పాఠశాలలు, ఎండ తీవ్రత వల్ల విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నెల 17వ తేదీ వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పోలవరం : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను జిల్లా ఎంపిపి సంఘాల అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ స్వరూప్, యువ నాయకులు పోడుం శ్యాంకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలు ఆపాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టులన్నీ తవ్వుకొని మట్టి అక్రమ దందా చేస్తున్నారని, వెంటనే మట్టి తవ్వకాలు ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్ అన్నారు. ఈ మేరకు ఏలురు స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైసిపి నాయకుల అండదండాలతో చింతలపూడి పట్టణంలోని పెద్ద చెరువులో, ఫాతిమాపురంలో మట్టి తవ్వకాలు ఎక్కువైపోతున్నాయన్నారు. చింతలపూడిలో ఉన్న గురుకుల పాఠశాల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. 650 పైగా విద్యార్థులు ఉంటే, నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయన్నారు. అవి కూడా కొన్ని ఉపయోగంలో లేవన్నారు. నూతన గురుకుల పాఠశాల పనులు త్వరగా పూర్తి చేసి విద్యార్థులను నూతన భవనంలోకి తరలించాలని కోరారు.


ఎంపిడిఒకు శుభాకాంక్షలు తెలుపుతున్న సింగరాజు

ఎంపిడిఒ శ్రీనుకు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన జి.శ్రీనును పోలవరం వైస్ ఎంపిపి మీడియం సింగరాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు కోటం బాబురావు, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి యు.రాజారావు శ్రీనుకు శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ పదార్థాలను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని ఐసిసిఎస్‌ఎల్ బ్రాంచ్ మేనేజర్ దీప్తి అన్నారు. ఐసిసిఎస్ ఎల్ ఇండియన్ కార్పొరేటివ్ క్రెడిట్ సొసైటీ చింతలపూడి బ్రాంచ్ వారీ ఆధ్వర్యంలో సేవ్ ఎర్త్ సేవ్ నేచర్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ప్రతిఒక్కరూ విధి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గౌతమ్, మానుకొండ, సబ్ రిజిస్ట్రార్ శ్యామ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

BEFORE THE COMMISSIONER FOR EMPLOYEES' COMPENSATION AND ASSISTANT COMMISSIONER OF LABOUR-IV: T.ANJAIAH KARMIKA SAMKSHEMA BHAVANAM R.T.C CROSS ROADS: AT HYDERABAD.
E.C.CASE.NO. 68 OF 2022 (F)
Between:
Darelli Devi Kumari @ Devi & others.
..Applicants.
AND
Beeravolu Shashidhar Reddy & another.
..Opposite parties.
To:
Beeravolu Shashidhar Reddy
S/o Srinivas Reddy @ Srinivas,
R/o D.No.26-7-1, Flat No.2, 3rd Floor,
Mahal Apartment, Rayalam,
Bheemavaram, Baslumidi Bheemavaram town, West Godavari District,
Andhra Pradesh State
Take notice that the Applicants have filed the above O.P. Under Section 22 of W.C.ACT.1923 for grant of compensation against you and another. The said case is posted to 26-06-2023 for your appearance.
Hence you are hereby directed to appear in person or through Advocate before the court on 26-06-2023 at 3-00 P.M., without fail, failing which the matter will be decided against you as per law.
Hyderabad,
Dt.12-07-2023
// BY ORDER OF THE COURT //
M. SRINIVSAS REDDY,
Advocate,
Nalgonda.

పత్రికా ప్రకటన

ఏలూరు నగరం, ఏలూరు పట్టణం, యన్.ఆర్.పేట, ఉషాబాల చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఫోర్ మెన్ అయిన **పుట్టి కళ్యాణ చక్రవర్తి, తండ్రి: పి.వి. సుబ్బారావు** అను నేను ఈ పత్రికా ప్రకటన ద్వారా యావత్తు ప్రజానికానికి యిందు మూలముగా తెలియచేయునదేమనగా..,

మా కంపెనీ కలెక్షన్ ఏజెంట్ అయిన నక్కిన రామలింగేశ్వరావు గారు అను వారు ది.10-06-2023వ తేదీ మధ్యాహ్నం 02:00 గంటలకు తన మోపెడ్ (టి.వి.యస్. కంపెనీ) నెం. ఎపి 37 బియమ్ 6838 నందు (1) ఉషాబాల చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన టెంపరరీ రసీప్ట్ బుక్ రిసిప్ట్ నెం. 46926 టు 46950 మరియు (2) యుబికె చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన టెంపరరీ రసీప్ట్ బుక్ రిసిప్ట్ నెం.5657 టు 5700ను ఒక లెదర్ బ్యాగులో వుంచుకొని, ఆ లెదర్ బ్యాగును తన వాహనమునకు తగిలించుకొని, చిట్ కలెక్షన్ నిమిత్తం తిరుగుతూ ఖండ్రికగూడెం సెంటర్‌లో వున్న ఇడ్లీస్ ఫుడ్ కార్నర్ వద్ద తన వాహనమును పార్క్ చేసి, సదరు షాపులోనికి వెళ్లి కూల్ డ్రింక్ త్రాగి, తిరిగి తన టి.వి.యస్. మోపెడ్ వద్దకు వచ్చిచూసేసరికి తన మోపెడ్ హుక్కుకు తగిలించివున్న లెదర్ బ్యాగ్ కనిపించలేదనియూ మరియూ చుట్టుప్రక్కల అందరినీ విచారించి, ఎంతగా వెతికిననూ సదరు బ్యాగు కనపడలేదని. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆ బ్యాగును దొంగిలించినారని మా సంస్థకు తెలియచేసియున్నారు.

కావున యిందుమూలముగా తెలియచేయునదేమనగా సదరు నలుపు కలర్ లెదర్ బ్యాగ్ మరియు అందులో వున్న పైన ఉదహరించిన రెండు టెంపరరీ రిసీప్ట్ బుక్లు ఎవరికైనా దొరికిన ఎడల మా సంస్థకు అప్పగించవలసినదిగా కోరడమైనది. పై రిసీప్ట్ బుక్స్ దొరికినవారు గానీ లేదా దొంగిలించిన వారు గానీ వారి స్వప్రయోజనాలకు ఉపయోగించిన ఎడల సదరు వ్యక్తుల చర్యలు మా సంస్థను ఏ విధంగానూ ప్రభావితం చేయజాలవని యిందుమూలముగా తెలియచేయడమైనది.
ఏలూరు,
10-06-2023.

పుట్టి కళ్యాణ చక్రవర్తి
ఫోర్ మెన్ ఉషాబాల చిట్స్ ప్రయివేట్ లిమిటెడ్,
ఏలూరు. సెల్: 94913 50189
ల్యాండ్ లైన్ నెం.08812 232691